

శుక్రవారం.. జొన్నాడ వద్ద..



శనివారం.. అదేచోట..

గోదారికి ఎర్ర నీరొచ్చింది..

గోదారమ్మకు పూజలు

గోదావరికి ఎర్ర నీరొచ్చింది. దీంతో గత ఆరేడు నెలలుగా గోదావరిలో నీరు లేక ఇసుక తిన్నెలతో ఉన్న గోదావరికి ఎర్రనీరు రావడంతో కళకళలాడుతోంది. గోదావరి ఎర్రనీటి కోసం రైతులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఎర్రనీరు పంట భూములలో పారిందంటే పంటలు బాగా పండుతాయని నమ్మకం. గోదావరికి ఎర్రనీరు రావడంతో పలువురు పూజలు చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఆలమూరు మండలం జొన్నాడ వద్ద శుక్రవారం సాధారణ నీటిలో ఉన్న గోదావరి, శనివారం ఎర్రనీటి గోదావరి చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. - **ఆలమూరు**

మహిళా..! ఉచిత బస్.. వచ్చేస్తోంది..!



మహిళలకు శుభవార్త.. సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తున్నారు.. మరో హామీ నెరవేర్చనున్నారు.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం హామీ అమలుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ఆ దిశగా తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో బస్‌లు సిద్ధం చేస్తున్నారు.

- యుద్ధప్రాతిపదికన బస్సులు సిద్ధం
- ఆగస్టు 15 నుంచి అమలు
- ఆర్టీసీ డిపోల్లో చురుగ్గా పనులు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ఉచితం?
- రోజుకు రూ.30 లక్షల భారం
- 'పల్లె వెలుగు'లకు మెరుగులు
- మహిళల ఆనందం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15.. స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ పథకం ఢిల్లీ, తెలంగాణ, కర్నాటకల్లో అమలవుతోంది. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' ప్రధానమైన వాగ్దానం. పథకం ప్రారంభించిన తర్వాత ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదనే ఉద్దేశంతో ఆ రాష్ట్రాల్లో ఇప్పటికే అధ్యయనం చేయించి ఒక అంచనాకు వచ్చారు. విధివిధానాలను ఖరారు చేసే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పథకం అమలు దాదాపు చివరి అంకంలో ఉంది. ఈ మేరకు అవసరమైన బస్సులను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు.

బస్‌లకు మరమ్మతులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, నిడదవోలు, కొవ్వూరు, కాకినాడ, తుని, ఏలేశ్వరం, అమలాపురం, రాజోలు, రామచంద్రాపురం, రావులపాలెం డిపోల్లోని పల్లె వెలుగు బస్సులను పూర్తిగా పరీక్షించి ఆ మేరకు మరమ్మతులు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన తర్వాత బస్సుల సీటింగ్ కెపాసిటీకి మించి రద్దీగా ప్రయాణికులు ఉండే అవకాశం ఉంది. ఈమేరకు కొన్ని డిపోలకు కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులు ఇచ్చారు. బాగా పాతబడిన వాటి బాడీలను పల్లెవెలుగు బస్సులతో మార్పుచేస్తున్నారు. గణాంకాలు పరిశీలిస్తే మొత్తం ఒక రోజులో ప్రయాణించే వాళ్లలో పల్లె వెలుగు బస్సుల్లో 50 శాతం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్పు పనులను ఆయా జిల్లాల జిల్లా ప్రజా రవాణా అధికారులు (డీపీటీవోలు) ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నారు. ఈడీ విజయరత్నం ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు ఉచితమట!

ఉచిత ప్రయాణం ఉమ్మడి జిల్లా ప్రాతిపాదికన కల్పిస్తారనే చర్చ నడుస్తోంది. అంటే తూర్పుగోదావరి జిల్లా మహిళలు కోనసీమ, కాకినాడ జిల్లాల వరకూ ప్రయాణించవచ్చు. వారికి జీరో టికెట్ ఇస్తారు. దీనిలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఉదాహరణకు కొవ్వూరు ఉమ్మడి పశ్చిమ గోదావరి పరిధిలోకి వస్తుంది. కానీ కొత్త జిల్లాల విభజనలో తూర్పులో కలిసింది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాల పరిధి అమలు చేస్తే ఏలూరు నుంచి కొవ్వూరు వరకూ ఉచితంగా వచ్చేసి, అక్కడి నుంచి రాజమండ్రికి టికెట్ కొనుక్కోవాల్సి రావచ్చు. ఇంకో ఐదు కిలోమీటర్లే కదా అని టికెట్ తీసుకోని వారి సంఖ్యా ఉంటుంది. వీళ్లను గుర్తించడం కష్టంగా మారొచ్చు. ఆర్టీసీ ఆవిధంగానూ ఆదాయం కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఇక ఉచిత ప్రయాణం మొదలు పెట్టిన తొలి రోజుల్లో తెలంగాణ, కర్నాటక చాలా కష్టాలు ఎదుర్కొన్నాయి. ఆయా ఇబ్బందులను అధిగమించే దిశగా ఆలోచన చేస్తున్నారు. దీంతో త్వరలోనే ఉచిత బస్ ప్రయాణం అమల్లోకి రానుంది.

ఉమ్మడి జిల్లాలో 532 బస్సులు

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 285 బస్సులు ఉండగా 165 పల్లెవెలుగు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 291కి 191, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 300కి 176 పల్లెవెలుగులు ఉన్నాయి. అంటే ఉమ్మడి తూర్పుగోదావరిలో మొత్తం అన్ని రకాల బస్సులు కలిపి 876 ఉండగా, వాటిలో 532 పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు ఉన్నాయి. వీటన్నిటినీ యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరిలో 89 వేలు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 80 వేల చొప్పున కలుపుకొని రోజుకు సరాసరిన 2.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగులో దాదాపు 50 శాతం మంది ప్రయాణిస్తున్నారు. మూడు జిల్లాల్లోని 11 ఆర్టీసీ డిపోల్లో రోజుకు రూ.1.20 కోట్ల ఆదాయం సమకూరుతోంది. వీటిలో పల్లె వెలుగు వాటా దాదాపు రూ.60లక్షల పైనే ఉంటుంది. మొత్తం ప్రయాణికుల్లో 50 శాతం మహిళల లెక్కన చూసినా రోజుకు రూ.30 లక్షల వరకూ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.



ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది..



స్పష్టమైన ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అయినప్పటికీ అన్ని బస్సులనూ సిద్ధం చేస్తున్నాం. మొదలుపెట్టిన తర్వాత ఇబ్బందులు రాకూడదనే కోణంలో పనులు జరుగుతున్నాయి. బస్సుల్లో సామర్థ్యానికి మించి రద్దీ ఉండే అవకాశం ఉంది. సమస్యలను అధ్యయనం చేసిన ప్రభుత్వం ముందే పరిష్కారాలు సూచించే అవకాశం ఉంది.

- రాఘవ కుమార్, డీపీటీవో, కోనసీమ జిల్లా



స్కెచ్‌కు బ్రేక్!

గనుల గలీజు పని బయటపెట్టిన ఆంధ్రజ్యోతి

- లీజు దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్
- వారం రోజులపాటు నిలిపివేత
- సర్వేయర్ పన్నాగానికి చెక్
- డీడీతో నేడు కాకినాడ కలెక్టర్ సమీక్ష
- కలెక్టర్‌ను కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే
- దరఖాస్తుల రద్దుకు డిమాండ్
- సర్వేయర్ వెనకేసింది రూ.కోటి పైనే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పక్కా 'స్కెచ్'కు బ్రేక్ పడింది. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం పక్కాగా 'స్కెచ్' అంటూ వచ్చిన కథనం గనుల శాఖలో తీవ్ర కలకలం రేపింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మైనింగ్ లీజుల కోసం దాఖలైన దరఖాస్తులన్నింటిని ఓ వారం పాటు పరిశీలించకుండా పక్కన పెట్టాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాజమహేంద్రవరంలోని గనుల శాఖ సర్వేయర్ ముందస్తు పథకంతో మైనింగ్ స్కెచ్‌లన్నీ అడ్డగోలుగా విక్రయించి అరకోటికి పైగా సంపాదించడంతో పాటు అనేక మంది దరఖాస్తుదారులకు స్కెచ్‌లే లేకుండా చేసి వారిని దెబ్బతీశాడు. అటు ఒకే స్కెచ్‌ను ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించి అడ్డంగా బరితెగించేశాడు. రాజమహేంద్రవరం గనులశాఖ ఏడీ కార్యాలయ సర్వేయర్ మైనింగ్ స్కెచ్‌లన్నీ ముందే తన వద్దకు రప్పించి దరఖాస్తుదారులకు హెక్టారుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయించేసిన విషయం వెలుగులోకి తేవడం తీవ్ర కలకలం రేపింది. ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో అనేక మంది దరఖాస్తుదారులు తమకు సైతం స్కెచ్‌లు ఇవ్వకుండా చేసి లీజు రాకుండా కుట్రపన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరైతే తాము సదరు సర్వేయర్‌కు రూ.5 లక్షలు ఇచ్చి కొనుగోలు చేసిన స్కెచ్‌ను మరొకరికి విక్రయించడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అనేకమంది సర్వేయర్ బాధితులు బయటకు వచ్చారు. అటు సర్వేయర్ ముందస్తు పథకంతో స్కెచ్‌ల పేరుతో దందాలు నడిపిన నేపథ్యంలో సోమవారం నుంచి పరిశీలన ప్రక్రియ ప్రారంభించాల్సిన దరఖాస్తులన్నింటిని నిలిపి వేయాలని గనులశాఖ నిర్ణయించింది. ఈలోపు జరిగిన తంతంగంపై పూర్తి స్థాయిలో వివరాలు రాబట్టాలని కాకినాడ కలెక్టర్ మైనింగ్ డీడీని ఆదేశించారు. అందులోభాగంగా స్కెచ్‌ల పేరుతో అసలు జరిగిన కథేంటనేది తేల్చాలని కలెక్టర్ నిర్ణయించారు.ఈ మేరకు ఆదివారం మైనింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని స్కెచ్‌లు ఉన్నాయి? ఎంత మందికి విక్రయించారు? వసూలు చేసిందెంత? దీని వల్ల స్కెచ్‌లు దక్కక నష్టపోయిన వారెందరు? అనేది ఈ సమావేశంలో నిగ్గు తేల్చనున్నారు. తద్వారా వచ్చిన దరఖాస్తులను పూర్తిగా పక్కనపెట్టి కొత్తగా దాఖలు చేయించాలా? లేదంటే తదుపరి వ్యూహం ఏంటనేది అమరావతిలో గనులశాఖ ఉన్నతాధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన 53 మైనింగ్ లీజు దరఖాస్తుల్లో 45 ఒక్క రౌతులపూడిలోని క్వారీలకే వచ్చాయి. స్కెచ్‌లు కొందరికే దక్కేలా మాయ చేసిన నేపథ్యంలో దరఖాస్తులను రద్దు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అవకతవకలు లేకుండా పారదర్శకంగా దరఖాస్తుల ప్రక్రియ మళ్లీ జరిగేలా చూడాలని కోరారు. అటు గనులశాఖ డీడీ సైతం ఆంధ్రజ్యోతి కథనాన్ని అమరావతిలోని గనులశాఖ డీఎంజీ దృష్టికి తీసుకువెళ్లారు. మరో పక్క సర్వేయర్ గలీజు దందా సంచలనంగా మారడంతో శనివారం కార్యాలయానికి సదరు ఉద్యోగి డుమ్మా కొట్టారు. ఇదంతా ఒకెత్తయితే మైనింగ్ స్కెచ్‌లను విక్రయించిన సదరు రాజమహేంద్రవరం ఏడీ కార్యాలయ సర్వేయర్ బండారం మరింత బయటపడుతోంది. మూడు రోజుల్లో స్కెచ్‌లు విక్రయించి వెనకేసింది రూ.కోటికిపైనే అని సమాచారం.తనకు ముడుపులు ముట్టజెప్పిన దరఖాస్తుదారులకు మైనింగ్ స్కెచ్‌లు ఇవ్వడంతోపాటు ఫస్ట్ కం ఫస్ట్ విధానంలో లీజులు దక్కుతుండడంతో అవి వచ్చేలా చేయడం కోసం కొందరు లీజుదారులతో వ్యాపారంలో వాటాలు ఖాయం చేసుకోవడం విశేషం. ఇదంతా తెలిసిన అధికారులే ఖంగుతింటున్నారు.. ఇక ఆదివారం జరిగే సమీక్షలో ఏం నిర్ణయం తీసుకుంటారో..

10న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు నిర్వహించాలి

అమలాపురం, జూలై5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్, టీచర్ సమావేశాలను ఈనెల 10న నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ కళాశాలలు, ప్రభుత్వ అనుబంధ విద్యా సంస్థలు అన్నిటిలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. కోనసీమ జిల్లాలో 2150 పాఠశాలల్లో, ఇతర విద్యాసంస్థల్లో ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 4 గంటలపాటు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు విద్యార్థుల అభ్యసనా కార్యక్రమాలు మెరుగుపరచడంలో వారిని భాగస్వాములుగా చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిపై ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులు సంబంధిత క్లాస్ టీచర్‌తో చర్చించాలని సూచించారు. ప్రతీ పాఠశాలకు విద్యాశాఖ నుంచే కాకుండా వేరే శాఖల నుంచి ఒకరిని పరిశీలకునిగా నియమించాలన్నారు. ప్రతీ విద్యార్థితో మూడు మొక్కలు నాటించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా లక్షా 30 వేల మొక్కలు సిద్ధంచేశామని, రవాణాకు ఖర్చులు మంజూరుచేస్తామన్నారు. సైబర్ క్రైమ్ వంటి అంశాలపై మహిళా పోలీసులతో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.

'ప్రొటోకాల్ డ్యూటీ నుంచి రెవెన్యూ శాఖను తొలగించడం హర్షణీయం'

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్‌డ్యూటీ నుంచి రెవెన్యూశాఖను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపట్ల కోనసీమ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం హర్షం వ్యక్తంచేసింది. జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం శనివారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో జిల్లా శాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ వాసా ఎస్. దివాకర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రెవెన్యూశాఖ ప్రొటోకాల్ పాటించడం వల్ల శాఖాపరమైన పనుల్లో వెనుకబడిపోతున్నారని, సీఎం చంద్రబాబు, రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌లు గుర్తించి ప్రొటోకాల్ డ్యూటీ నుంచి మినహాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్, అసోసియేట్ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్, ఇతర నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

బేబీ కిట్టు.. అందేటట్టు!



త్వరలో అందించనున్న కూటమి ప్రభుత్వం

కిట్‌లో ఏం ఉంటాయంటే..

ఎన్టీఆర్ బేబీ కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంటాయి. దీని ధర రూ.1410గా ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నారి తల్లితోపాటు శిశువు నిద్రపోయేందుకు బెడ్, దోమ తెర, తల్లులు చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, సబ్బు, పౌడర్, న్యాప్‌కిన్, రెండు తువ్వాళ్లు, చిన్న బొమ్మ ఉంటాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్లను తిరిగి పంపిణీ చేయాలని నిర్ణయించింది.

- పాత పథకానికి పునరుద్ధరణ
- ప్రభుత్వాసుపత్రుల్లో అందజేత
- 2021 నుంచి నిలిపేసిన వైసీపీ
- నెలాఖరు నుంచి అమలు యోచన

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

నాడు టీడీపీ ప్రభుత్వం అందజేసిన పలు ప్రజాసంక్షేమ పథకాలను గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో చాలా మందికి ఆ పథకాలు దూరమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మళ్లీ తిరిగి వాటిని ప్రజలందరికీ చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ వైద్యశాలల్లో జన్మించిన చిన్నారులకు రక్షణ కల్పించేందుకు బేబీ కిట్లను పంపిణీచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అధికారంలో ఉన్నంతకాలం పథకాన్ని అమలుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకం పేరు మార్చింది. కిట్లను పూర్తిగా అటకెక్కించింది. 2021 నుంచి పూర్తిగా నిలిపివేసింది. దీంతో పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. బయట కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత లేక అవస్థలుపడ్డారు. గతంలో తాము అధికారంలో ఉండగా అమలు చేసిన ఈ పథకాన్ని మళ్లీ అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీనిలో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకునే బాలింతలకు ఈ కిట్లు అందజేయనుంది.

ఈ నెలాఖరు నుంచి బేబి కిట్లు

జిల్లాల్లోని డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్‌లకు రెండేళ్లపాటు రేట్ కాంట్రాక్టు పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా టెండర్లు పిలిచారు. ఆ బాధ్యతను ఆంధ్ర ప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)కు ప్రభుత్వం అప్పగించింది. అర్హత కలిగిన తయారీదారులు, అధికారిక డిస్ట్రిబ్యూటర్లు ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో బిడ్లు సమర్పించాలని పేర్కొంది. ఈ నెలాఖరు నుంచి ఈ బేబీ కిట్లు పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సుమారు 50 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రసవాలు జరిగితే కుటుంబ సభ్యులు కిట్లను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి. దీని ఖరీదు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఉంటోంది. నిరుపేదలైన వారు కొనుగోలు చేసే పరిస్థితి లేక అలాగే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఈ ప్రభావం చిన్నారుల ఆరోగ్యంపై పడుతుంది. వివిధ రకాల రుగ్మతలతో బాధపడే అవకాశం ఉంది. అలాంటి వారికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎంతో మేలు కలుగుతోంది.

రాజీపడితే తగ్గినట్టు కాదు.. నెగ్గినట్టు!

లోక్ అదాలత్ ప్రారంభంలో పీడీజే గంధం సునీత



బాధిత కుటుంబానికి రూ.కోటి నమూనా చెక్ అందజేస్తున్న ఉమ్మడి జిల్లా జడ్జి సునీత

రాజమహేంద్రవరం, జూలై5(ఆంధ్ర జ్యోతి): సత్వర న్యాయమే లోక్ అదాలత్‌ల లక్ష్యమని.. రాజీ పడితే తగ్గినట్టు కాదని.. నెగ్గినట్టని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం 47 బెంచ్‌లపై జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. రాజమహేంద్రవరం డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో పీడీజే ప్రారంభించి మాట్లాడారు. రాజీమార్గం ఎప్పుడూ రాజమార్గమేనన్న విషయం మరువరాదన్నారు. జిల్లాలో మొత్తం 85వేల కేసులు పెండింగ్‌లో ఉండగా 60, 642 రాజీకి యోగ్యమైనవన్నారు. వీటిలో 9,272 సివిల్, క్రిమినల్, 2136 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. పీడీజే కోర్టులో కేసు నెం.1/2025కి సంబంధించి కక్షిదారుడి కుటుంబానికి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా చెల్లించే రూ.1.15 కోట్ల పరిహారం నమూనా చెక్కు అందజేశారు. శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 47 బెంచ్‌లపై 6,179 వేల కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్ 473, క్రిమినల్ 5,514, పీఎల్‌సీ 192 కేసులు ఉన్నాయి. రాత్రి 9.30 గంటల తర్వాత పూర్తయిన కేసుల సంఖ్యను లెక్కిస్తున్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు 18,67,73,973 పరిహారం అవార్డును చెల్లించారు.





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్.. హాజరైన వివిధ శాఖల అధికారులు

విపస్యన ధ్యానంతో పని ఒత్తిడిని అధిగమించాలి

అధికారులకు కలెక్టర్ మహేష్‌కుమార్ సూచన

అమలాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడిని అధిగమించి మనశ్శాంతితో సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి విపస్యన సాంకేతికత ఆచరణాత్మక మార్గమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో విపస్యన ధ్యాన కార్యక్రమంపై ఎంఈవోలు, హెచ్ఎంలతో అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో పిల్లలకు వయస్సుల వారీగా ఈ ధ్యాన కార్యక్రమాల నిర్వహణ విధివిధానాలపై చర్చించారు. శాంతి, సామరస్యాన్ని అనుభవించడానికి ఈ మార్గం వీలుకల్పిస్తుందన్నారు. ఈ ధ్యానం దశలవారీగా అన్ని మానసిక కల్మషాల నుంచి పూర్తిగా విముక్తి కలిగిస్తుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఎనిమిది వసతిగృహ పాఠశాలల్లో విపస్యన ధ్యాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, వ్యక్తిగత శ్రద్ధతో ఈ కార్యక్రమాల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను వయసుల వారీగా విభజించి ఆగస్టు 15 నాటికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కలెక్టర్ ఆదేశించారు. 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల తరగతి గదుల్లోనే ధ్యాన కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులపై పని ఒత్తిడి, బద్ధకాన్ని తగ్గించడానికి ఈ ధ్యానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో రెండున్నర కోట్ల మంది విద్యార్థులు విపస్యన ధ్యాన కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఇప్పటికే విలస, కె.గంగవరం జడ్పీ పాఠశాలల్లో అమలు చేస్తున్నట్టు తెలిపారు. ముందుగా సమావేశంలో ధ్యాన యోగా గురువులు లక్ష్మయ్య, నాగార్జున, జిల్ల సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

వేతనాల పెంపు..

ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి నైపుణ్యం కలవారికి మస్తర్ రోల్ వేతనాల సవరణకు సంబంధించి రూ.734 నుంచి రూ.764 వరకు పెంచడం జరిగిందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. సెమీ స్కిల్డ్ వర్కర్లకు రూ.518 నుంచి రూ.539 వరకు నైపుణ్యంలేని పనివార్లకు రూ.416 నుంచి రూ.433 వరకు పెంచినట్టు తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వేతనాల సవరణకోసం వివిధ విభాగాల ఇంజనీర్లు, కార్మికశాఖ సహాయ కమిషనర్లతో సంప్రదింపులు జరిపి సుదీర్ఘంగా చర్చించిన తరువాత ఈ వేతనాలు నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో కార్మికశాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈఈ రాజేంద్రప్రసాద్, ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి పాల్గొన్నారు.

గోదారి..రంగు మారి!



ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి గోదావరిలో కలుస్తోంది. దీంతో గోదావరి నది కొత్త రంగులో కనిపిస్తోంది. ఎర్ర నీరు ఎక్కువగా వచ్చి చేరడంతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీరు రంగు మారిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





స్వల్పంగా పెరిగిన గోదావరి నీటి మట్టం

1,89,129 క్యూసెక్కులు సముద్రంలోకి



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

ధవళేశ్వరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంకలు నుంచి వచ్చి చేరుతున్న నీటితో గోదావరి స్వల్పంగా పెరిగి ప్రవహిస్తుంది. తూ ర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లోని 66గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లలోని 42గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 20గేట్లు, విజ్జేశ్వరాలయంలో 29 గేట్లను 40 మీటర్ల మేర పైకి ఎత్తి 1,89,129 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.80అడుగులుగా నమోదైంది. వ్యవసా య అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4200 క్యూ సెక్కులు, మధ్యడెల్టాకు 2450క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5800 క్యూసెక్కులు చొప్పున సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగిన నీటి మట్టం శనివారం సాయంత్రం 20.30 అడుగులుగా నమోదైంది.

ఉరకలేస్తున్న పొల్లూరు జలపాతం



మోతుగూడెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పొల్లూరు జలపాతం ఉరకలేస్తోంది. సు మారు 50 అడు గులు పై నుంచి నీటి ప్రవా హం కిందకు పడుతుంది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద గడిపేందుకు తరలివస్తున్నారు.

జంతుప్రేమ.. జాగ్రత్త సుమా!

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ తప్పనిసరి

నేడు వరల్డ్ జూనోసిస్ డే



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

కాకినాడక్రైం, జూలై5(ఆంధ్రజ్యోతి): జంతు ప్రేమికులు నానాటికి పెరుగుతున్నారు. ముఖ్యంగా శునకాలను, పిల్లులను పెంచేవారి సంఖ్య నగరాల్లో, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో క్రమంగా పెరుగుతుంది. అలాంటి పెంపుడు జంతువులకు వ్యాధులు సోకకుండా చూసుకునే బాధ్యత పెంపకందార్లపై ఉంటుంది. జూనోసిస్ వ్యాధి అనేది జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు వచ్చే వ్యాధి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటి వరకు 250 జూనోటిక్ వ్యాధులను గుర్తించింది. పిచ్చి కుక్క కాటుకు గురైన వ్యక్తికి 1885 సంవత్సరం జూలై 6న లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త తొలిసారి యాంటి ర్యాబిస్ టీకాను వేసి విజయం సాధించారు. ఈ కారణంగా ప్రతి సంవత్సరం జూలై 6న ప్రపంచ జూనోసిస్ డేగా జరుపుకోవడం జరుగుతోంది. ఈ వ్యాధి ప్రాణాంతకం. సాధారణంగా వ్యాక్సినేషన్ కాని జంతువు కరవడం వల్ల ర్యాబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పిచ్చికుక్క కరిచిన నాలుగు నుంచి ఏడు వారాలలోపు ర్యాబీస్ వ్యాధి లక్షణాలు బయట పడి మనిషి మృత్యువాత పడడం ఖాయం. ఈ నేపథ్యంలో పెంపుడు కుక్కలకు అలాగే వీధి కుక్కలకు తప్పనిసరిగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించాలి. జూనోసిస్‌డే సందర్భంగా జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు ప్రతి పెంపుడు శునకానికి ప్రతి పశువైద్యశాలలో ఉచితంగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుంది. జిల్లాకు 28 వేలు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్‌లు సమకూర్చినట్టు పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.కృష్ణమూర్తి తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పశువైద్యశాలలోను యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించి వాటిని సురక్షితంగా ఉంచడంతోపాటు వాటి యజమానులు సురక్షితంగా ఉంటారని డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు.

టీడీపీ కాపు సామాజిక ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక



తెలుగుదేశం కాపు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆత్మీయ కలయికలో ఎంపీ సతీష్‌బాబు, వంగవీటి రాధా

సామర్లకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి చెందిన కాపు సామాజిక ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయ ఆవరణలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ హాజరయ్యారు. ఎంపీ సతీష్‌బాబు నేతృత్వంలో కాపు ప్రజాప్రతినిధులు కొద్దిసేపు అంతరంగికంగా సమావేశమయ్యారు. ప్రధానంగా కాపు సామాజికవర్గానికి చెందిన పలు సమస్యలను వివాదాలక తీతంగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లేందుకు కాకినాడ జిల్లా తరపున ఎంపీ సతీష్‌బాబు సారథ్యం వహించేందుకు ఇప్పటికే రాష్ట్ర కాపు నాయకులకు సుముఖత వ్యక్తం చేసిన విషయం విదితమే. అందులో భాగంగా ముందుగా టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులను తన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ కలయిక ఏర్పాటుచేయడమే గాక వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధాను రప్పించడంలో ఎంపీ సతీష్‌బాబు కృషిచేశారు. అదే తరుణంలో కాపు ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జ్యోతుల నవీన్‌తో కలిసి ఎంపీ సతీష్‌బాబు, వంగవీటి రాధా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆత్మీయ విందు స్వీకరించారు. విందులో టీడీపీ కాకినాడ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పార్టీ నాయకులు ఆకుల రామ కృష్ణ, గంధం పల్లంరాజు, మోటుకూరి వెంకటేష్, అల్లాడి శరత్, చిక్కాల గణేష్, రాయపురెడ్డి రాజా, ఎస్ఎన్.రాజా, మెట్ల రమణబాబు, ఆరేటి ప్రకాష్, చింతపల్లి అర్జున్, ఆనంద్‌న్యూటన్, ఏసుదాసు పాల్గొన్నారు.

వంగవీటి రాధాకు సత్కారం

కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను సామర్లకోట మండలం కొప్పవరంలోని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీ నేతృత్వంలో రాధాకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జ్యోతుల నవీన్, ఆకుల రామకృష్ణ, ఆంధ్రా కాపు సద్భావనా సంఘం రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, బసవా ప్రభాకరరావు, సిద్దు నూకరాజు, గొల్లపల్లి లక్ష్మణరావు, వల్లకూడి బాబ్జీల చేతులమీదుగా జ్ఞాపికను రాధాకు అందజేశారు.

అల్లూరి కలెక్టర్, గిరిజన సంక్షేమ కార్యదర్శికి

జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో రెవెన్యూ అధికారులు ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపులో భాగంగా గిరిజనులకు చెందిన ఇళ్లను కూడా కూల్చేసిన ఘటనలపై జాతీయ ఎస్టీ కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. రంపచోడవరానికి చెందిన ముర్ల లక్ష్మి అనే గిరిజన మహిళ రెవెన్యూ అధికారులు చట్టవిరుద్ధంగా తన ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో కూల్చేసి తనకు నష్టాన్ని చేకూర్చారని ఫిర్యాదు చేశారు. ఇందుకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం తహశీల్దార్‌గా పనిచేసిన రామకృష్ణ తదితరులు బాధ్యులని, వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించి భువనేశ్వర్‌లోని ప్రాంతీయ కార్యాలయం అల్లూరి కలెక్టర్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసు జారీ చేసి 30 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది.

760 టన్నుల ఇసుక నిల్వలు స్వాధీనం

6 టన్నుల ఇసుకతో లారీ బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగింత



దివాన్‌చెరువులో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

దివాన్‌చెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లో రెండు వేర్వేరు ప్రాంతాల్లోని భారీ ఇసుక నిల్వలను టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శనివారం స్వాధీనం చేసుకుంది. అలాగే 6 టన్నుల ఇసుకలోడ్‌తో పాటు లారీని స్వాధీనపరచుకున్నారు. వివరాల ప్రకారం.. దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం దాడులు చేసింది. ఆ సమయంలో ఒకప్రాంతంలో నిల్వ చేసిన 260 టన్నుల ఇసుక, మరోచోట నిల్వ చేసిన 500 టన్నుల ఇసుక మొత్తం 760 టన్నుల నిల్వలను అధికారులను స్వాధీనం పర్చుకున్నారు. దీంతో పాటు 6 టన్నుల లోడ్‌తో అక్కడికి వచ్చిన ఇసుక లారీ బిల్లులను పరిశీలించారు. అయితే ఆ బిల్లులో శనివారం ఉదయం సమయంతో ఉందని, మధ్యాహ్నం 12 గంటల వరకే ఈ బిల్లు పనిచేస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కె.ఆంజనేయులు తెలిపారు. సమయం మించి సాయంత్రం కావడం వల్ల 6 టన్నుల ఇసుకతో పాటు లారీని స్వాధీనపర్చుకుని బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. అలాగే దివాన్‌చెరువులోని 2 వేర్వేరు ప్రాంతాల్లో నిల్వ చేసిన 760 టన్నుల ఇసుకను స్వాధీనపర్చుకుని వీఆర్వోకు అప్పగించినట్టు మైనింగ్ శాఖ సాంకేతిక సిబ్బంది శైలజ తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు ఇసుక నిల్వలు స్వాధీనపర్చుకున్నామన్నారు. తాను గృహనిర్మాణాలు చేసే కాంట్రాక్టర్‌నని, ఇక్కడ ఖాళీస్థలాలు ఉండడంతో గృహనిర్మాణ పనుల నిమిత్తం ఇసుకను ఇక్కడ నిల్వచేసుకున్నానని పి.వెంకటేశ్వరరావు అధికారులను కలసి వివరించాడు. వీటికి సంబంధించిన బిల్లులను తీసుకుని సోమవారం తమ కార్యాలయంలో హాజరుకావాలని శైలజ తెలిపారు. దాడుల్లో రవాణాశాఖ నుంచి గిరి, మైనింగ్ శాఖ సాంకేతిక సిబ్బంది మనీషా, దివాన్ చెరువు వీఆర్వో డి.రామజోగి కుడా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు



తీవ్రగాయాల పాలైన యువకులు

రెండు గంటలైనా ఆసుపత్రికి రాని వైద్యులు

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

రాజవొమ్మంగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం దూసరపాము శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూసరపాము శివారులో ద్విచక్ర వాహనానికి గెదే అడ్డు రావడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రాజవొమ్మంగి గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాసు, సోముల వంశీ, అనంతగిరి గ్రామానికి చెందిన దూరిపల్లి వివేక్ వర్ధన్ తీవ్ర గాయాలపాలయ్యారు. శ్రీనివాసు, వివేక్‌కు ఎడమ కాళ్లు విరిగినట్టు వైద్య సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదం తరువాత అరగంట ప్రధాన రహదారిపైనే యువకులు గగ్గోలుపెట్టారు. అనంతరం రాజవొమ్మంగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో సుమారు 2 గంటలపాటు క్షతగాత్రులు రోదించారు. యువకులను కాకినాడ, రాజమహేంద్రవరం ఆసుపత్రులకు వైద్య సిబ్బంది రిఫర్ చేశారు. 2 గంటలైనా వైద్యులు అందుబాటులో లేకపోవడం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆగ్రహం వ్యక్తం చేశా రు. వైద్యులు ఆసుపత్రిలో లేకపోవడమే కాకుండా మండలంలోనే నివాసం ఉండట్లేదని తెలిసి ఘటనపైఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

లారీ ఢీకొని వృద్ధ దంపతులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ వృద్ధ దంపతులు

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కామనగరువు బైపాస్ రోడ్డులో మోటారు సైకిల్‌పై వస్తున్న వృద్ధ దంపతులను లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి శివారు వాడపర్రుకు చెందిన వృద్ధ దంపతులు ముసమళ్ల దొరయ్య (67), మాణిక్యాంబ (61) వైద్య పరీక్షల కోసం మోటారుసైకిల్‌పై శనివారం అమలాపురం బయలుదేరారు. బైపాస్‌రోడ్డు జంక్షన్ దాటుతుండగా చెన్నై నుంచి కోల్‌కతా వైపు వెళతున్న లారీ వేగంగా వచ్చి మోటారుసైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దొరయ్య తలకు తీవ్ర గాయమైంది. మాణిక్యాంబ సైతం తీవ్రంగా గాయపడి తొలుత స్థానిక ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచనలతో కాకినాడ ఆసుపత్రికి హుటాహుటీన తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు చెప్పారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు వేళంగి విద్యార్థి



హరీష్

కరప, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి డి.హరీష్ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్.త్రిమూర్తులు తెలి పారు. గత నెల 21 నుంచి 30 వరకు ఏలూరులోని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్లో జరిగిన టీఎస్‌సీ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ లాంచింగ్ క్యాంప్‌లో హరీష్ ప్రతిభ కనబరిచి ఫైరింగ్ విభాగంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హరీష్‌ను హెచ్ఎం, పీఎంసీ చైర్‌పర్సన్ ఎస్.వెంకటలక్ష్మి, సర్పంచ్ నీలిమారాజేష్, పాఠశాల అభివృద్ధి కమిటీసభ్యుడు వీరయ్యచౌదరి అభినందించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

తుని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేస్టేషన్ శివారు 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై రైలు నుంచి జారి పడి సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. వ్యక్తి నీలం రంగు చొక్కా, తెలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడని సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను, 94906 19020 నెంబర్లో కానీ సంప్రదించాలని కోరారు.

రైల్వేస్టేషన్ల మధ్యలో..



కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ ప.అప్పారావు తెలిపారు. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం పశివేదల, కొవ్వూరు రైల్వేస్టేషన్ల మధ్యలో కొవ్వూరు యార్డు వద్ద సుమారు 40 ఏళ్ల వ్యక్తి గాయాలపాలై మృతి చెందినట్టు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతదేహంపై నలుపురంగు కట్ డ్రాయర్, బిస్కెట్ కలర్ షర్ట్, నలుపురంగు పారగాన్ చెప్పులు ఉన్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061లో సమాచారం అందించాలన్నారు.

పంటకాల్వలో పడి చేనేత కార్మికుడు మృతి



సత్యనారాయణ(ఫైల్)

ముమ్మిడివరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుడు ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఉన్న పంటకాల్వలో పడి మృతిచెందాడు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం కాశివానితూము సెంటర్ వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు బొడ్డు సత్యనారాయణ (79) శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి టీ తాగుందుకు బైపాస్ రోడ్డుకు వెళ్లగా ఆ రోడ్డు పక్కన ఉన్న రాణేలంక పంటకాల్వలో అదుపుతప్పి పడి మృతిచెందాడు. అతడి సోదరుడు ప్రభాకరరావు ఫిర్యాదు చేయగా ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సత్యనారాయణ ముమ్మిడివరం చేనేత పారిశ్రామిక ఉత్పత్తి విక్రయ కేంద్రంలో సభ్యుడిగా కొనసాగుతున్నాడు.

తునిలో అగ్నిప్రమాదం

తుని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని వీరవరపుపేటలో ఓ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ధారా కృష్ణవేణి షాపులో కిరాణా సామగ్రి ఆహుతయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు.

చెస్ చాంపియన్‌షిప్ విజేతగా అక్షయ

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెనికి చెందిన సత్తి అక్షయ జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. కర్ణాటకలో నిర్వహించిన ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌ను అక్షయ గెలుపొందినట్టు ఆమె తాతయ్య ప్రసాద్ తెలిపారు. ప్రసాద్ కుమారుడైన విజయ్‌రవిచంద్ర ప్రస్తుతం ఉత్తర, కన్నడ జిల్లాలో ఉన్న కైగా అణు విద్యుత్ కేంద్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే పదో తరగతి చదువుతున్న అక్షయ కర్ణాటక ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ సాధించడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు చేశారు.



విజేతగా మెమెంటో అందుకుంటున్న అక్షయ

హత్య కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన కిరణ్ కార్తీక్ హత్య కేసులో అదే గ్రామానికి చెందిన నులకతట్టి కృష్ణప్రసాద్, దుల్లపల్లి వినోద్‌ను అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సామర్లకోట పోలీసులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా యువకుడు మిస్సింగ్ పేరిట కేసు నమోదు చేయగా దర్యాప్తు అనంతరం హత్యగా నిర్ధారించబడడంతో హత్యకేసుగా మలిచినట్టు సీఐ కృష్ణభగవాన్ వెల్లడించారు. నిందితులు తామే ఈ హత్య చేసినట్టు అంగీకరించారని, దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

ఐ.పోలవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ పుష్కరఘాట్ వద్ద పోలీసులు శనివారం 9 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్టు చేశారు. పుష్కరఘాట్ వద్ద నలుగురు యువకులు గంజాయితో ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 9 కిలోల గంజాయి లభించింది. దీనికి సంబంధించి నలుగురు యువకులను అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిలో ముగ్గురు పాతనేరస్తులుగా గుర్తించారు. ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు, అతడి కోసం గాలిస్తున్నట్టు ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.66.31 లక్షలు



హైకోర్టు జడ్జి దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఈవో

ఆత్రేయపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రం శనివారం భక్తులతో పులకించింది. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రూ.66.31 లక్షల ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని హైకోర్టు జడ్జి వి.వెంకటజ్యోతిర్మయి మహిమ-శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. వారిని వేదపండితులు ఆశీర్వదించగా ఈవో స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

అన్నదాన ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన కొత్తపల్లి రవిశంకర్ కుటుంబ సమేతంగా శనివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.58వేలు విరాళం అందించారు. దాత రవిశంకర్‌కు ప్రధాన అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వారికి మరింత జవాబుదారీతనంగా ఉండేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ శనివారం పాలగుమ్మిలో తొలి అడుగు కార్యక్రమం కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అర్హత ఉండి పథకాలు అందనివారు ఉంటే చెప్పాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడుతో కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటన్నింటినీ టీడీపీ యాప్‌లో నమోదుచేసి త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, మాజీ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, దేవరపల్లి వీరేశ్‌కుమార్, చంటిరాజు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, మట్ట మహలక్ష్మిప్రభాకర్, మంద గెద్దయ్య, మాడా మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉప్పలగుప్తం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. టి.చల్లపల్లిలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఇప్పటి వరకు అమలు చేసిన, ఇక ముందు అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు అందించి, ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు పెచ్చెట్టి బాబు, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నియోజకవర్గ యువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా, పార్టీ కార్యదర్శి బూసి బుజ్జిదొర, నీటిసంఘం చైర్మన్ పోలిశెట్టి ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు దంగేటి రవీంద్రనాథ్, పండు వెంకటేశ్వరరావు, దంగేటి బాబులు, పోలిశెట్టి శివాజీ, సుంకర రాంబాబు, పోలిశెట్టి రామకృష్ణారావు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, కుంపట్ల వెంకన్నబాబు, ఎన్. లక్ష్మణపేరయ్యనాయుడు, కొల్లు పెద్దిరాజు, సాక హరిబాబు, బుంగ పండు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం: పాలగుమ్మిలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఓడలరేవులో సుపరిపాలన ప్రచారం

అల్లవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఓడలరేవులో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొల్లు విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాలు వివరించి ఎమ్మెల్యే ఆనందరావు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రేకాడి శేషగిరి, పచ్చిమాల ఏడుకొండలు, కె.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మామిడికుదురులో సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

అనాతవరంలో 'తొలి అడుగు'

ముమ్మిడివరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజలకు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తూ ముందుకు సాగుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనాతవరంలో సుపరిపాలన తొలి అడుగు డోర్‌టూడోర్ కార్యక్రమాన్ని గ్రామకమిటీ అధ్యక్షుడు కురసాల శివబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పనుల వివరాల బ్రోచర్లను ప్రజలకు అందించారు. ప్రజల సమస్యలను అడిగి వాటిని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, నీటి సంఘం అధ్యక్షుడు శీలం వెంకటేశ్వరరావు, గుబ్బల తాతబ్బాయి, పేరిచర్ల సురేష్‌రాజు, పెయ్యల వెంకటరమణ, నిమ్మన వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి అబ్బు, కర్రి రాజేష్, మట్టపర్తి రాంబాబు, యిళ్ల శ్రీనివాస్, చొల్లంగి సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 17,19,21 వార్డుల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేశారు. అభివృద్ధి పనులను వివరించారు. దొమ్మేటి రమణకుమార్, ములపర్తి బాలకృష్ణ, వాసంశెట్టి అమ్మాజీ, మెండి కమల, కాకి మాణిక్యం, నిమ్మకాయల విస్సు, జాగు సత్తిబాబు, జాగు రాంబాబు, ర్యాలి ప్రసాద్, అత్తిలి లక్ష్మీప్రసన్న, కంచర్ల సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన

మామిడికుదురు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో సుపరిపాలన జరుగుతుందని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఆనందోత్సాహాలతో జీవిస్తున్నారని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. మామిడికుదురులోని అంబేడ్కర్ సామాజిక భవనంలో పార్టీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ అధ్యక్షతన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమ సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి అభివృద్ధిని తెలియచేస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, నాయకులు బోనం బాబు, చాగంటి స్వామి, ఈలి శ్రీనివాస్, కడలి కృష్ణమోహన్, ముఖ్రం హుస్సేన్, సూదా బాబ్జి, భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, యెరుబండి లక్ష్మయ్య, విత్తనాల జానకీరామ్, సాపే ఏకాదశి, వాసంశెట్టి వెంకట్రావు, ఉండ్రు శ్రీరామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని ఎర్ర బ్యాడ్జీలతో నిరసన



ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ జోనల్, డిపో ప్రతినిధులు

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీవీ నారాయణ, జిల్లా కార్యదర్శి మేడిది శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితో నడిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీకి సంబంధించి 24నెలల బకాయిలు చెల్లించాలని, 2023 జూన్ నుంచి 12వ పీఆర్సీ అమలు జరిపి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమలాపురం ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి గేట్ మీటింగ్ నిర్వహించారు. డిపో అధ్యక్షుడు పీవీ రమణ ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం జరిగిన కార్యక్రమానికి జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీసీఎస్ కేంద్ర కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. డిపో కార్యదర్శి ఎస్ఎస్వీ గణేష్ మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. గేట్ మీటింగ్‌లో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఎండీ రజాక్, ఎన్ఆర్‌సీహెచ్ రావు, భవానీ, రాంబాబు, రవి, కల్వకొలను ప్రసాద్, సత్తిరాజు, గ్యారేజీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు 60వాటర్ ట్యాంకుల నిర్మాణం



కాట్రేనిపాడులో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

రాజోలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రూ.1650 కోట్లతో సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి సరఫరాలో భాగంగా కాట్రేనిపాడులో వాటరు ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బర్లంక వాటర్ గ్రిడ్ నుంచి రాజోలు నియోజకవర్గానికి పైపులైను ద్వారా మంచినీటి సరఫరా జరగనుందన్నారు. రూ.1650కోట్లతో సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి సరఫరాలో భాగంగా రాజోలు నియోజకవర్గంలో 60వాటరు ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. తద్వారా ప్రజలకు మంచినీటి కష్టాలు తీరతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు, సూరిశెట్టి శ్రీనివాస్, గుండాబత్తుల తాతాజీ, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

సలహాదారులుగా విద్యావంతులు



అటవీశాఖ ఐటీ సలహాదారుడు నాగబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, రెడ్డి సుబ్రహ్మణ్యం

పి.గన్నవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన విద్యావంతులను సలహాదారులుగా కూటమి ప్రభుత్వం నియమిస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. అటవీ శాఖ ఐటీ సలహాదారుడిగా నియమితులైన పెన్నమరెడ్డి నాగబాబుకు జనసేన క్యాంపు కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైసీపీప్రభుత్వ హయాంలో వందలాది మంది సలహాదారులు ఉంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విద్యావంతులు పదిలోపే సలహాదారులుగా ఉంటారన్నారు. అనంతరం నాగబాబును సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్ర మంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, పెనుమాల లక్ష్మి, వాసంశెట్టి కు మార్, జాలెం శ్రీనివాసరాజా, పత్తిపాటి ఉమామహేశ్వరి, దొమ్మేటి సాయికృష్ణ, శేరు శ్రీనుబాబు, ఏ.సూర్యనారాయణమూర్తి, యడ్ల ఏసు, నూకపెయ్యి ప్రసన్నకుమార్, గుడాల ఫణి, తాటికాయల శ్రీనివాసరావు, అన్నాబత్తుల హనుమాన్, మద్దుల అనూ శ్రీరాజేశ్వరి, తాటికాయల వెంకటేష్, యన్నాబత్తుల వెం కటేశ్వరరావు, కోట రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి స్వాతినక్షత్ర పూజలు



స్వాతి నక్షత్ర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, జూలై 5(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శనివారం స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతినక్షత్ర పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఆలయంలో అర్చకులు కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపించి 108కలశాల్లో స్వామివారి అష్టోత్తర నామాలతో ఆవాహనచేసి కలశలకు పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ముందుగా సముద్ర, నదీ స్నానాలు చేసిన భక్తులు క్షేత్ర సంరక్షకుడు ఆంజనేయస్వామి, క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.1,14,686, అన్నదాన ట్రస్టు ద్వారా రూ.80,076, మొత్తం రూ.1,94,762 ఆదాయం వచ్చింది.

లోక్‌అదాలత్‌లో 154 కేసుల పరిష్కారం

ముమ్మిడివరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 154కేసులు పరిష్కారం కాగా రూ.50,62,453 అపరాధ రుసుం వసూలైంది. 5ఈపీ కేసులకు సంబంధించి రూ.6.60లక్షలు, 4 ఓఎస్ మనీ కేసులకు రూ.7.60లక్షలు, ఓఎస్ టైటిల్ మూడు కేసులు, 3ఎంసీ కేసులకు రూ.10లక్షలు, డీవీసీ కేసు1, ఎన్ఐయాక్టు 7కేసులకు రూ.16.50లక్షలు, 38 ఐపీసీ సీసీ కేసులకు రూ.2.76లక్షల, 79ఎక్సైజ్ కేసులకు రూ.4,5 5,177, 6బ్యాంకు పీఎల్సీ కేసులకు రూ.2,50,500, 7బీఎస్ఎన్ఎల్‌పీఎల్‌సీ కేసులకు రూ.5,776, ఒక బెంచ్ కోర్టు కేసు పరిష్కారమయ్యాయి.

జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ ఆధ్వర్యంలో నాలుగు బెంచ్‌ల్లో కేసుల పరిష్కారం చేపట్టారు. జిల్లా జడ్జితో పాటు సీనియర్ సివిల్ జడ్జి ఇ.రమణారెడ్డి, సివిల్ జడ్జి ఎం.రహ్మతుల్లా, అడిషనల్ జ్యుడిషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సుంకర శ్రీరేఖ పలు కేసులను విచారణ జరిపి ఇరు పక్షాల ఆమోదంతో వాటిని పరిష్కరించారు.

వరద విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి



ముమ్మిడివరం: మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

ముమ్మిడివరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, గోదావరి వరద విపత్తును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగమంతా సంసిద్ధంగా ఉండాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలస్థాయి అధికారులతో వరదలు ఎదుర్కొనేందుకు సంసిద్ధత కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలతో సమాయత్తం కావాలన్నారు. ముందుగా మండల స్థాయి విపత్తుల నిర్వహణ కార్యాచరణ ప్రణాళికలు శాఖల వారీగా రూపొందించుకుని జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యశాఖ అధికారులు మోటారు బోట్లు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు సిద్ధం చేసుకుని ముంపు బాధితులను పునరావాస కేంద్రాలు తరలించేందుకు వీలుగా సిద్ధం కావాలన్నారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర విపత్తుల స్పందన దళం ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకున్నామని, వారి ద్వారా ఎటువంటి ఆస్తి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణ, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

పి.గన్నవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాబోయే వరదల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేసి విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. శనివారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వచ్చిన వరద లను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఉన్న పాఠశాలలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, విద్యుత్ సబ్‌స్టేషన్లను, తాగునీటి సదుపాయం, తుఫాను షెల్టర్లను, అంగన్‌వాడీ కేంద్రాలను తదితర అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలన చేసుకోవాలన్నారు. అనంతరం శాఖలు వారీగా సమీక్ష నిర్వహించి మ్యాప్ ద్వారా మండల స్థాయి ఉద్యోగులకు గోదావరి ఉధృతి ఏవిధంగా ఉంటుంది, మొదటి, రెండోవ, మూడోవ ప్రమాద హెచ్చరికలపై అవగాహన కల్పిం చారు. నియోజకర్గ ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ పీడీ టి.సాయినాధ జయచంద్రగాంధీ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, సీఐ ఆర్.భీమరాజు, డిప్యూటి ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు మొక్కలు నాటాలి

అమలాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతను, జీవన విధానాన్ని కాపాడేందుకు నిర్వహించే ముఖ్యమైన కార్యక్రమం వనమహోత్సవమని ఆర్డీవో కె.మాధవి పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి జీవరాశి మనుగడకు తోడడ్పాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆదిత్య పాఠశాల విద్యార్థులతో ఈనెల7వ తేదీ వరకు నిర్వహిస్తున్న వన మహోత్సవ వారోత్సవ ర్యాలీని ఆమె ప్రారంభించారు. భూసార పరిరక్షణకు, వృక్షాలు నేలకోతను తగ్గించి భూసారాన్ని పెంచుతాయన్నారు. చెట్లు వర్షపాతాన్ని ఆకర్షించి భూగర్భ జలాల పెంపునకు దోహదపడతాయన్నారు. ర్యాలీలో ఆదిత్య పాఠశాల ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్, రెవెన్యూ, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించొద్దు

అంతర్వేది, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుకు విద్యుత్‌స్మార్ట్ మీటర్లు బిగించరాదని వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిందని సీపీఐ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె.సత్తిబాబు, సీపీఐ నాయకులు చెల్లుబోయిన తాతాజీ, దొండపాటి చిట్టిరాజు, డి.భానోజీ, వై.వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశునికి విశేష అలంకారం

అమలాపురం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారిని శనివారం పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు బారులుతీరి అలంకార శోభితుడైన స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన టిక్కెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, దేవస్థానం ఈవో వెంకటేశ్వరరావు, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, కౌన్సిలర్ గండి దేవిహారిక, మాజీ కౌన్సిలర్ జంగా అబ్బాయివెంకన్న, దున్నాల దుర్గ పాల్గొన్నారు.

అంబాజీపేట ఎంపీడీవోగా నరసింహం



అంబాజీపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట ఎంపీడీవో ఏపీఎల్ నరసింహం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన భీమారావు ఉద్యోగ విరమణ చేశారు. బాధ్యతలు స్వీకరించిన నరసింహంను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సత్కరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయనను కలుసుకుని సత్కరించారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కూనపరెడ్డి



రాజోలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజోలు మండలం శివకోటికి చెందిన కూనపరెడ్డి రాంబాబు నియమితులయ్యారు. తనను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసిందని శనివారం ఆయన తెలిపారు. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరావు



ఉప్పలగుప్తం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా కార్యదర్శిగా ఎస్.యానాంకు చెందిన పొగాకు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులందినట్టు శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. తన నియామకం పట్ల పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యానాంలో మెగా రక్తదాన శిబిరం

యానాం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ జన్మదిన వేడుకను పురస్కరించుకు అభిమాన సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 91యూనిట్ల రక్తని సేకరించారు. ముఖ్య అతిథిగా ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. శిబిరానికి యానాం పరిసర ప్రాంతాల నుంచి యువత తరలివచ్చారు. కాకినాడ యువసేన బ్లడ్‌బ్యాంక్ సభ్యులు రక్త దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్త దాతలకు మల్లాడి సర్టిఫికేట్లను అందజేశారు. అనంతరం మల్లాడి అభిమాన యూత్ బృందం మల్లాడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సి పల్ మాజీ వైస్‌చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, విశ్రాంత సీఐ గూటం శివగణేష్, యువసేన బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు

అమలాపురం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం ఏరియా పశు వైద్యశాల వద్ద అన్ని పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఆదివారం ఉచితంగా ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నామని అమలాపురం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి తెలిపారు. రేబిస్ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు సోకే ప్రాణాంతకమైన వ్యాధి అన్నారు. ఒకసారి వ్యాధి లక్షణాలు కనపడితే చికిత్స లేదని, అందుకే ముందుగానే కుక్కలకు టీకాలు వేయిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఇందుకోసం రెండు బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు పశుప్రేమికుల సహకారంతో వీధి కుక్కలకు టీకాలు వేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

సహజ పర్యావరణానికి జ్యూట్ బ్యాగ్స్ అవసరం

రాజోలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి జ్యూట్ బ్యాగ్స్ ఎంతో అనుకూలంగా ఉంటాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నంబరు 2 పాఠశాల వద్ద మండల పరిషత్ భవనంలో జనమిత మహిళా శక్తి జ్యూట్ బ్యాగు శిక్షణ, ఉపాధి కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా దేవ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా జనపనారతో జ్యూట్ బ్యాగులను తయారు చేస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, సర్పంచ్ రేవు జ్యోతి, సూరిశెట్టి శ్రీను, ఉలిశెట్టి అన్నపూర్ణ, పినిశెట్టి బుజ్జి, కాట్న రాజు, పామర్తి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై వెంకటపతిరాజాకు డాక్టరేట్



అంతర్వేది, జూలై5(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలేనికి చెందిన ఎన్నారై యెనుముల వెంకటపతిరాజాకు అమెరికా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని ఒక ప్రకటలో తెలిపారు. ఢిల్లీలో జరిగిన గ్లోబ్ సమ్మిట్‌లో ఇంటర్నేషనల్ అమెరికా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు కృషి చేస్తున్నందున డాక్టరేట్‌లభించిందని ఎన్నారై వెంకటపతిరాజా తెలిపారు.


వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వరదపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అధికారులు వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి లోటుపాట్లు తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి, తహశీల్దార్ సునీల్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, ఆర్ఐ ఇబ్రహీం, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మామిడికుదురు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. జిల్లాలోని మొహర్రం సంతాప దినాల సందర్భంగా 60అసుర్‌ఖానాలు (పంజా)కు వక్ఫ్‌బోర్డు కేటాయించిన నిధులను నగరం, మామిడికుదురులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అందించారు. ఒక్కో పంజాకు రూ.5వేలు చొప్పున పంజా నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మెంబర్ హాజీముఖ్రం హుస్సేన్, స్థానిక ముస్లిం నాయకులు సజ్జాద్ హుస్సేన్, అబేద్ అలీ, కేఎం రజా, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు జాలెం సుబ్బారావు, వాసంశెట్టి కుమార్, రమేష్ పాల్గొన్నారు.

అప్పనపల్లి బాలబాలాజీకి భక్తి శ్రద్ధలతో పూజలు



తొలి హారతి దృశ్యం

మామిడికుదురు, జూలై 5(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారిని వేదమంత్రోచ్చారణ నడుమ సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలి హారతి ఇచ్చారు. శనివారం పురస్కరించుకుని స్వామివారిని, ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. వేకువ జాము నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామివారిని శనివారం 4,500మంది భక్తులు దర్శించుకుని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో 2600మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ తెలిపారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,75,614 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

మలికిపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ మీటర్లు బిగించాలనే ఆలోచనలో ఉన్న ప్రభుత్వ విధానాలను సీపీఐ సమావేశం తప్పుబట్టింది. శనివారం దిండిలో జరిగిన సీపీఐ మండల నాల్గవ మహాసభలో ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె.సత్తిబాబు మాట్లాడుతూ అదానీతో కుదుర్చుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. దేవ సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, దేవ సురేష్ బాబు, మేడిచర్ల సత్యనారాయణ, బత్తుల రవిప్రసాద్ పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్ ఆత్మహత్యాయత్నం

అంతర్వేది, జూలై 5(ఆంధ్రజ్యోతి): గొంది గ్రామానికి చెందిన డ్వాక్రా వీవోఏ (యానిమేటర్) తండాల ఆదిలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపు గ్రామ ప్రెసిడెంట్ గెడ్డం సులోచన వేధింపులకు మనస్తాపానికి గురైన నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరింది. కుటుంబ సభ్యులు మలికిపురంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఏపీఎం అజయ్‌ను వివరణ కోరగా ఆమె ఆరోగ్య పరిస్థితి బాగుండడంతో వారిద్దరినీ కూర్చోబెట్టి మాట్లాడతామని చెప్పారు.

విట్‌నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దుచేయాలి

అమలాపురంటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈనెల10న పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు నిర్వహించే మెగా పీటీఎంలో విట్‌నెస్ అధికారి నియామక ఉత్తర్వులను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, మేడిచర్ల టీఎస్ఎస్ సుబ్బారావు డిమాండ్ చేశారు. విట్‌నెస్ అధికారిని పాఠశాల హెచ్‌ఎంలే నియమించుకుని వారిచేత వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్రప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి టీడీపీ ఎన్నారై సాయం

పి.గన్నవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో ఏడాది చదువుతున్న పి.గన్నవరానికి చెందిన పెచ్చెట్టి తేజకు వాడ్రేవుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ ఎన్ఆర్ఐ టి.శ్రీకాంత్ ల్యాప్‌టాప్, రూ.51వేలు అందించారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఎన్ఆర్ఐ శ్రీకాంత్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం తేజ సోదరుడు ఈశ్వర్‌కు ల్యాప్‌టాప్, నగదు అందజేశారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ముమ్మిడివరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కీటక జనిత వ్యాధుల నియంత్రణకు మగ ఆరోగ్య కార్యకర్తలు కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర పిలుపునిచ్చారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని వైద్య ఆరోగ్య కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జిల్లాలోని మగ ఆరోగ్య కార్యకర్తలకు కీటక జనిత వ్యాధుల నియంత్రణపై నిర్వహించిన పునశ్చరణ శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో దుర్గారావుదొర పాల్గొని మాట్లాడారు. శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కీటక నియంత్రణ, డ్రగ్ షెడ్యూల్, మలేరియా, డెంగ్యూ, బోధ వ్యాధి, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో సబ్‌యూనిట్ అధికారులు రాజ్‌కుమార్, ఎన్వీ రామారావు, దీనదయాళ్ బిషప్, రాజబాబు, ఆదినారాయణ, జిల్లాలోని 170మంది పురుష ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆదాయం రూ.1.93 లక్షలు

కొత్తపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తు లు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ. 1,93,267 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి హరినారాయణ

లోక్ అదాలత్‌లో 103 కేసుల పరిష్కారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 103 కేసులు పరిష్కరించినట్టు రామచంద్రపురం 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం. హరినారాయణ తెలిపారు. శనివారం జిల్లా అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీమార్గం ద్వారానే సత్వర పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం నిర్వహించిన అదాలత్‌లో సివిల్ కేసులు 15, క్రిమినల్ కేసులు 75, పీఎల్‌వీ కేసులు 13 పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి, ఏజె ఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, లోక్‌అదాలత్ సభ్యుడు పలివెల సత్యనారాయణ, జుత్తుక నాగేశ్వరరావు, బొడ్డపాటి సురేష్ కుమార్, నీలం సత్తిరాజు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు వరాహనరసింహమూర్తి, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

కుప్పకూలిన డ్రైన్ వంతెన

అలమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్ల వద్ద పెనికేరు-గుమ్మిలేరు మీడియం డ్రైన్‌పై ఉన్న వంతెన కుప్పకూలిపోయింది. దీంతో పినపళ్ల, గుమ్మిలేరు, మండపేట రైతులకు తీవ్ర ఇబ్బందులుగా మారింది. ఇదే ప్రాంతంలో ఉన్న పేపరుమిల్లుకు సంబంధించిన వాహనాలు, మిల్లుకు వెళ్లే సిబ్బందికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వంతెన దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మాణం జరిగినట్టు రైతులు చెబుతున్నారు. వంతెన కూలిపోవడంతో ఆభూముల వద్దకు వెళ్లేందుకు మార్గం తెగిపోయిది. వం తెన ఏర్పడిన తర్వాత చాలా మందికి మండపేటకు చేరుకోవడానికి ఇది దగ్గర మార్గంగా ఉపయోగపడేది. వంతెన కూలిపోయిన విష యాన్ని సాగునీటి సంఘాల ప్రతినిధులకు తెలియజేయడంతో శనివారం ఆలమూరు సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు పరిశీలించారు. డ్రైనేజీ అధికారులతో వారు చర్చించారు. కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంటుందని వారు వివరించినట్లు తెలిపారు. నిధులకు సంబంధించిన అంశాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు నీటి సంఘం ప్రతినిధులు గోపాలస్వామి, శ్రీనివాసరావు తెలిపారు. తాత్కాలికంగా రైతులు వెళ్లేలా చర్యలు చేపట్టనున్నట్టు వారు తెలిపారు.



ఆలమూరు మండలం పినపళ్ల వద్ద కుప్పకూలిన డ్రైన్‌ను వంతెనను పరిశీలిస్తున్న నీటి సంఘాల ప్రతినిధులు

ముమ్మరంగా వరినాట్లు

కపిలేశ్వరపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఇంత వరకు 2,300 ఎకరాల్లో వెదజల్లడం పూర్తి కాగా, 2,600 ఎకరాల్లో వరినాట్లు పూర్తయినట్లు శనివారం ఏవో బలుసు రవి తెలిపారు. ఆయా ప్రాంత రైతులు 25శాతం వెదజల్లడం, 20 శాతం నాట్లు వేయడం ద్వారా పనులు పూర్తి చేశారన్నారు. వ్యవసాయశాఖ సూచనల మేరకు రైతులు త్వరితగతిన వరినాట్లు పూర్తి చేయాలని ఆయన కోరారు.



మాచర-టేకి ఆయకట్టు పరిధిలో వరినాట్లు వేస్తున్న శ్రామికులు

రెండో రోజు కొనసాగిన నిరసన

రావులపాలెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు చేపట్టిన నిరసన రెండో రోజు కొనసాగింది. ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. భోజన విరామంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ మద్దతు తెలిపినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. యూనియన్ రీజనల్ ప్రెసిడెంట్ రావుల సుబ్బారావు అధ్యక్షతన, సెక్రటరీ జీపీ రావు, ప్రెసిడెంట్ ఎల్ఎస్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తదితర పలు డిమాండ్లతో నిరసన చేపట్టి నినాదాలు చేశారు.



రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

కొత్తపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మోడేకుర్రులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు విద్యార్థులతో ఎమ్మెల్యే ముచ్చటించి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దాతృత్వం..

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

కె.గంగవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ మంత్రి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కుందూరులో పర్యటించినప్పుడు దివ్యాంగురాలు బొడ్డు నారాయణరావు తనకు ట్రైసైకిల్ ఇప్పించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి శనివారం ట్రై సైకిల్‌ను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. విలాస గంగవరం గ్రామానికి చెందిన రుద్రాక్షుల వీరవెంకట సత్యనారాయణ పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి విషయాన్ని కూటమి నాయకుల ద్వారా తెలుసుకుని తక్షణసాయంగా రూ.12వేల చెక్కును అందజేశారు. అతని కుమారుడు శశి వీరేంద్రను చదివించే బాధ్యత తీసుకుంటానని చెప్పి ప్రతినెలా రూ.6వేలు అందజేస్తామని ప్రకటించారు. మంత్రి దాతృత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పలువురికి మంత్రి ఆర్థికసాయం

ద్రాక్షారామ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట గ్రామానికి చెందిన పలువురికి మంత్రి శనివారం ఆర్థికసాయం అందచేశారు. గ్రామానికి చెందిన పల్లి శ్రీను, రవ్వా పెద్ద వెంకటరమణలకు ఇటీవల ప్రమాదంలో కాళ్లు విరగడంతో వారికి రూ.25 వేల చెక్కు అందచేశారు. ఇటీవల భర్త మరణించగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పినికే ఉమాకు నిత్యావసర వస్తువుల నిమిత్తం రూ.10 వేలు అందచేశారు. కుమారుడు మరణించిన పిల్లి వెంకట లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేలు అందచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

• సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు • జనంతో మమేకమైన నేతలు

రాయవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం రాయవరం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులతో ఉన్నా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. ఈసందర్భంగా ప్రజలు, చేనేత కార్మికులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంధ్ర దేవి, వల్లూరి శ్రీనివాస్, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కోట వెంకటరమణ, జనసేన నేత దేవిశెట్టి కోటేశ్వరరావు(చిన్ని), చల్లా సత్యనారాయణ, దొంతంశెట్టి బాల కేదారీశ్వరుడు, ఇందుగుమిల్లి అరుణ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాది.. పరదాల పాలన కాదు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలా పరదాల పాలన కాదని, తమది ప్రజాపాలన అంటూ తొలిఅడుగు కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం మోడేకుర్రులో జరిగిన తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులపై ప్రజల్లో సంతృప్తి కనబడుతోందన్నారు. గత ప్రభుత్వంలో అరాచకం రాజ్యమేలితే, నేడు సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల



కొత్తపేట మండలం మోడేకుర్రులో జరిగిన కార్యక్రమంలో సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

వసతిగృహాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 5(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహాన్ని ఆర్డీవో దేవరకొండ అఖిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలోని వసతి సదుపాయాలు పరిశీలించారు. బాలికలతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్నారు. మెను, స్టాకు రిజిస్టరును ఆమె పరిశీలించారు.



దివ్యాంగులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన ట్రై సైకిళ్లు

దివ్యాంగుల పంపిణీకి ట్రై సైకిళ్లు సిద్ధం

మండపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ట్రై సైకిళ్లను సిద్ధం చేసింది. బ్యాటరీ ట్రై సైకిళ్లతో పాటు మామూలు సైకిళ్లు కూడా ఇప్పటికే ఆయా మండలాలకు చేరాయి. మండపేట మండల పరిషత్‌కు బ్యాటరీ ట్రైసైకిళ్లు 63, మామూలు ట్రై సైకిళ్లు 23 వచ్చాయని ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే త్వరలో అర్హులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

ముగిసిన వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

ఆలమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలమూరు విక్రమభట్టేశ్వరస్వామి ఆలయంలో గతనెల 26న ప్రారంభం కాగా, శుక్రవారం రాత్రితో నవరాత్రి ఉత్సవాలను ముగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ పూజలు జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి ఇష్టమైన చిలకడదుంప ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

భీమేశ్వరాలయ హుండీల ఆదాయం రూ.28.04 లక్షలు

ద్రాక్షారామ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి హుండీల ద్వారా రూ.28,04,547 ఆదాయం వచ్చింది. శనివారం స్వామివారి హుండీలను దేవదాయశాఖ జిల్లా అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ ఆధ్వర్యంలో సిబ్బంది హుండీలను లెక్కించారు. మార్చి 5వ తేదీ నుంచి నేటి వరకు రూ.26,90,853, బంగారం 5 గ్రాములు, వెండి 90 గ్రాములు వచ్చినట్లు వారు తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా రూ1,12,694 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గంగవరం గ్రూపు దేవాలయాల ఈవో వి.బాలకృష్ణ, వెల్ల గ్రూపు ఆలయాల ఈవో వైవీవీ సత్యనారాయణ, ఆలయాల సిబ్బంది, అర్చకులు, గ్రామపెద్దలు దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, పలువురు భక్తులు పాల్గొన్నారు.



చెల్లూరు సచివాలయానికి కంప్యూటర్ బహూకరిస్తున్న దృశ్యం

కంప్యూటర్ బహూకరణ

రాయవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చెల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి శనివారం దాత వితరణతో కంప్యూటర్ బహూకరించారు. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు సచివాలయానికి కంప్యూటర్ అందించాలని శ్రీసర్వారాయ చక్కెర కర్మాగారం యాజమాన్యాన్ని కోరారు. దీంతో ఫ్యాక్టరీ ఎండీ కృష్ణమోహన్ వితరణతో కంప్యూటర్‌ను కొనుగోలు చేశారు. ఫ్యాక్టరీ జీఎం జి.కోటేశ్వరరావు చేతులమీదుగా సచివాలయానికి కంప్యూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ సతీష్, టీడీపీ నాయకులు పసల విద్యాధర్, మోరంపూడి రాజ్‌కుమార్, ఎం. రామకృష్ణ, పి.విద్యాధర్, డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను వంచించిన ప్రభుత్వం'

ద్రాక్షారామ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను వంచించిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక ఫంక్షన్ హాలు లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ముందుగా దివంగత వైఎస్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కె.సూర్యనారాయణరావు, బి. ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

పి4ను పారదర్శకంగా అమలుచేయాలి

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు పి4ను పారదర్శకంగా అమలు చేయాలని మంత్రి సుభాష్ కోరారు. శనివారం రామచంద్రపురం మండలం పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మార్గదర్శకులు, బంగారు కుటుంబాల ఎంపిక పారదర్శకంగా జరపాలన్నారు. మార్గదర్శకుల ఎంపిక వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రతి ఇంట్లో సేంద్రీయ కూరగాయలు సాగు చేపట్టాలన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలను పి4కు అనుసంధానించాలన్నారు. ఆర్డీవో దేవరకొండ అఖిల మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో అయిదుగురు మార్గదర్శకులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎంపీడీవోలు ఈమేరకు చర్యలు చేపట్టాలన్నారు. నేడు ముగ్గురు మార్గదర్శకులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మృత్యుంజయరావు, శ్రీరామ్, ఠాగూర్, ఎంపీడీవోలు కడలి పద్మజ్యోతి, శ్రీనివాస్, రాంబాబు, ఇతర మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. అదే విధంగా రూ.38 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవానీ, సర్పంచ్ అంబటి తుకారాం, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మేకా జానకి రామయ్య, టీడీపీ నాయకులు పితాని వీరభద్రరావు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్తమూరుకు నిరంతర విద్యుత్ సరఫరా

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లోటల్టేజీ సమస్య రాకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. అర్తమూరుకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించే ఆర్.డీఎస్.ఎస్. పథకం ద్వారా మారేడుబాక సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా కేంద్రాన్ని ఆయన ప్రారంభిం చారు. అనంతరం అర్తమూరులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారం భించారు. గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి అధ్యక్షతన అర్తమూరులో జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వారంతా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వీర్రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు వివరించారు.ముందుగా గ్రామంలో టీడీపీ శ్రేణులతో ఆయన పర్యటించారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను దుయ్యబట్టారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కర్రి జంబయ్య, టీడీపీ మండపేట మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, స్థానిక నేతలు, చిర్ల రామన్నకాపు, పడాల సుబ్బారెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి, తాడి శేషారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్, విద్యుత్ శాఖ అధికారులు, పలువురు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

తలసేమియా పిల్లలకు అండగా రక్తదాన శిబిరం

రావులపాలెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో తలసేమియా పిల్లలకు అండగా ఉండేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. టీమ్ నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అంబటి కిషోర్ పుట్టినరోజు సందర్భంగా అతని మిత్ర బృందం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాజమండ్రి సంజీవిని బ్లడ్‌బ్యాంకు సహకారంతో 21 మంది ఆయన మిత్రులు, టీమ్ నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రక్తదానం చేశారు.

పొలాలను పరిశీలించిన ఏవో

రాయవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మాపురం, చెల్లూరు గ్రామాల్లోని పొలాలను శనివారం వ్యవసాయ మండల అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా కూర్మాపురం గ్రామ నాయకులతో కలిసి సొసైటీని సందర్శించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానని ఏవో అన్నారు. కార్యక్రమంలో మతుకుపల్లి భాస్కరరావు, ముత్యాల చిన్నబ్బు, గుణ్ణం పనసయ్య, కౌలు రైతు మట్టపర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

రాయవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాయవరం ఎంపీపీ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించారు. బదిలీపై వెళ్లిన కె.సత్యనారాయణమ్మ, రాయవరపు భాస్కరరావును సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ మాట్లాడుతూ ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయన్నారు. అనంతరం సత్యనారాయణమ్మ, భాస్కరరావులను హెచ్‌ఎం లచ్చిరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ఉపాధ్యాయులు కె.నాగిరెడ్డి, ఎల్. సత్యనారాయణరావు, ఎం.రామకృష్ణ, ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు. సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మురళీకృష్ణ, సిలర్ జాన్, బాలకృష్ణ మూర్తి, సీతారామయ్య, రాంబాబు, వెంకట మోహన్, శ్రీనివాసరెడ్డి మాధవి, జగదీష్ బదిలీ కాగా పాఠశాల హెచ్‌ఎం ఆర్.దయామణి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైన్లు క్లినింగ్‌పై స్పెషల్ డ్రైవ్

ఆలమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గుమ్మిలేరు పంచాయతీ డ్రైన్ల క్లీనింగ్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఈదల వీర్రాజు ఆధ్వర్యంలో గ్రామంలో పూడికతో ఉన్న డ్రైన్లను గుర్తించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా పనులు సాగుతున్నట్లు ఆయన తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న సీఐ విద్యాసాగర్

క్షతగాత్రుడిని ఆసుపత్రికి చేర్చిన సీఐ

అలమూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆసుపత్రికి చేర్చి మానవత్వాన్ని చాటారు. జొన్నాడ కొత్త బ్రిడ్జిపై ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి పడిపోవడంతో అటుగా వెళుతున్న సీఐ స్థానికుల సాయంతో తన వాహనంలో ఎక్కించుకుని వెళ్లి ఆసుపత్రిలో చేర్పించారు. క్షతగాత్రుడికి గాయాలయ్యాయని ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్టు సీఐ పేర్కొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఆత్రేయపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. మెర్లపాలేనికి చెందిన నిచ్చెన్నకోళ్ల రాజేశ్వరికి, అదే గ్రామానికి చెందిన రామాంజనేయులతో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నకానులతో పాటు లాంఛనాలు ఇచ్చారు. కొన్నాళ్లపాటు సజావుగా సాగిన వీరి కాపురంలో భర్తతో పాటు అత్తమామలు అదనపు కట్నం తేవాలంటూ తరచూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వారి వేధింపులు తాళలేక ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థికసాయం

ఆత్రేయపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మెర్లపాలెం గ్రామానికి చెందిన రంకిరెడ్డి దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం కోలుకున్నారు. టీమ్ నేను సైతం వ్యవస్థాపక అధ్యక్షుడు అంబటి కిషోర్ ఆధ్వర్యంలో సభ్యులు రూ.10,200 ఆర్థిక సాయాన్ని సర్పంచ్ మెర్ల రాము చేతులమీదుగా బాధితుడికి అందచేశారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

ఆత్రేయపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం మెర్లపాలెం ఎంపీపీ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్‌లు, షూలను సర్పంచ్ రాము విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమర రాఘవ, స్కూల్ చైర్మన్ యార్లగడ్డ దయామణి తదితరులు పాల్గొన్నారు.